
జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట







శుక్రవారం, జూన్ 12, 2026 పేజీలు :3

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

### గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



# 'మొక్క 'వోని దీక్ష..



మేఘం సమృద్ధిగా వర్షించగానే ప్రకృతి పులకరించే విధంగా.. పచ్చదనానికి కాంతులు తెచ్చే వన మహోత్సవానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. పర్యావరణ పరిరక్షణలో పచ్చదనాన్ని పెంపొందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం మొక్కవోని దీక్షతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. 2026-27 వన మహోత్సవంలో భాగంగా 12వ విడత మొక్కలు నాటేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే నర్సరీలో మొక్కలను పెంచి సిద్ధంగా ఉంచారు. భారీ వర్షాలు కురవగానే మొక్కలను నాటే ప్రక్రియ చేపట్టన్నారు. గత సంవత్సరం మాదిరిగానే ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, కార్యాలయాల్లో మొక్కలను నాటే విధంగా వివిధ శాఖలకు లక్ష్యాలను నిర్దేశించారు. వనమహోత్సవంలో నీడనిచ్చే చెట్లతో పాటు పండ్లు, పూల మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వన మహోత్సవంలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జూన్ 2న లాంఛనంగా మొక్కలు నాటారు.

### ఉపాధి హామీ పనులను వేగవంతంగా

## నాణ్యతతో పూర్తి చేయాలి



**వనపర్తి, జూన్ 11 (ప్రజాజ్యోతి):**

గురువారం పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద నీటి నిల్వ కోసం చేపడుతున్న ట్రెంచ్(కందకాల)ల తవ్వక పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, కార్మికుల హాజరు నమోదు, ట్రెంచ్‌ల తవ్వకాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న కూలీలతో నేరుగా మాట్లాడి పనుల స్వరూపం, పని వేళలు, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై ఆరా తీశారు.

ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో కార్మికులకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాస

## పనులను పూర్తి చేయాలి

### పునరావాసం భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు




## ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

-పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి ఉండాలి..
-ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి..
-కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్‌కర్నూల్, జూన్ 11(ప్రజాజ్యోతి ):** కల్వకుర్తిలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో నాణ్యతకు అత్యంత

# ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాస పనులను పూర్తి చేయాలి

నారాయణపేట ప్రతినిధి జూన్ 11 (ప్రజా జ్యోతి)

నారాయణపేట జిల్లాకు సంబంధించిన వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం (ఆర్ , ఆర్) మరియు పెండింగ్ అంశాలపై ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక, ఐ.ఏ.ఎస్. మరియు పునరావాసం ɒ భూసేకరణ కమిషనర్ శ్రీ కె. శివకుమార్ నాయుడు, ఐ.ఏ.ఎస్. అధ్యక్షతన భూసేకరణ, ఇరిగేషన్, సర్వే ɒ భూ రికార్డుల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో భీమా ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను తక్షణమే పూర్తి చేసి, సంబంధిత భూములను ఇరిగేషన్ శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.భీమా మరియు కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని సంబంధిత చీఫ్ ఇంజనీర్‌కు కమిషనర్ సూచించారు. భూసేకరణ ప్రక్రియలో నిధుల కొరత కారణంగా ఎటువంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా మక్తల్--నారాయణపేట--కోడంగల్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, ఇరిగేషన్ శాఖ పరిధిలో ఇంకా ఏవైనా పెండింగ్ రిక్విజిషన్లు ఉన్నట్లయితే వాటిని వెంటనే భూసేకరణ అధికారులకు అందజేసి తదుపరి చర్యలు చేపట్టేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

జూరాల ప్రాజెక్టు ( బిజెపి) పరిధిలోని అనుగొండ, అంకెన్‌పల్లి మరియు దాదన్‌పల్లి పునరావాస కేంద్రాలకు సంబంధించిన భూసేకరణ మరియు అభివృద్ధి పనుల పురోగతిని కూడా సమీక్షించారు. పునరావాస కేంద్రాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్వాసిత కుటుంబాలకు




అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కమిషనర్ శ్రీ కె. శివకుమార్ నాయుడు మాట్లాడుతూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో అమలవుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత గల ప్రాజెక్టులుగా గుర్తించిందన్నారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందువల్ల పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే పునరావాస కేంద్రాలలో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ తదితర అన్ని మౌలిక సదుపాయాలను కల్పించి, నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన జీవన వాతావరణం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ సి . హెచ్.ప్రియాంక, ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా భూసేకరణ మరియు పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను గారు, భీమా మరియు కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్, భీమా ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీధర్, కోయిల్‌సాగర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రతాప్ సింగ్, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ) ఎల్. రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్, సహాయ సంచాలకులు (సర్వే ɒ భూ రికార్డులు)తో పాటు ఇరిగేషన్, భూసేకరణ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

**గద్వాల జూన్ 11**

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జూన్ 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ బాల కార్మిక నిర్మూలన వ్యతిరేక దినోత్సవంకు సంబంధించిన గోడపత్రికలను సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. యాక్సెస్ టు జస్టిస్ మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు చిన్నమ్మ తామస్, డిసిపిఓ నరసింహ, కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎడ్విన్ థామస్, శ్రీలక్ష్మి, సోషల్ మొబిలైజర్స్ ధనలక్ష్మి, విజ్జులత, మద్దిలేటి పాల్గొన్నారు.ా

# ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన సంక్షేమ సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి ప్రాజెక్టు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి కావాలని, వాటి నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

మొదటగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన కలెక్టర్, షాపుల కేటాయింపు విధానం, వినియోగ పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ వాణిజ్య సముదాయం ద్వారా స్థానిక యువతకు, చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు విస్తరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న దుకాణాలను కార్పొరేషన్ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించి ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై ఇంజినీర్లతో మాట్లాడిన కలెక్టర్ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే నిర్మాణ సామగ్రి, సిబ్బందిని పెంచి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ అక్కడి సదుపాయాలను పరిశీలించారు. పశువుల కొనుగోలు, విక్రయాల కోసం వచ్చే రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌లో పరిశుభ్రతను కాపాడటంతో పాటు తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

అభివృద్ధి పనులు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకురావాలంటే నాణ్యత, పారదర్శకత, సమయపాలన కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి పనిని బాధ్యతాయుతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల ఆనంద్ కుమార్, కమిషనర్ మహమూద్ షేఖ్, కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, ఐకెపి, గృహ నిర్మాణ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## బడిబాట కార్యక్రమంలో భాగంగా ఖాజీపూర్ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ జనార్ధన్ రెడ్డి



**నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి జూన్11:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపూర్ ప్రభుత్వ పాఠశాలను బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంఈఓ జనార్ధన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) పరిస్థితులను పరిశీలించి గ్రామ సర్పంచ్ ఎం. సాయప్ప, ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయ బృందంతో




సమావేశమై చర్చించారు.గ్రామంలో బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎం.సాయప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఖాజీపూర్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈఓకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మాలలకు విద్యను అందించడమే లక్ష్యం..

పాలెం వెంకటయ్య...

మాగనూర్, జూన్ 11 ప్రజా జ్యోతి : మాల సామాజిక వర్గానికి విద్యను అందించడమే అంతిమ లక్ష్యమని మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ నారాయణపేట్ జిల్లా ఉపాధ్యక్షులు పాలెం వెంకటయ్య అన్నారు. గురువారం మండలంలోని పుంజనూరు గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరసింహ, ఉపాధ్యక్షులుగా భీమేష్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజు కోశాధికారిగా పెద్ద భీమేష్ ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీను, మారెప్ప, సురేష్, నరసింహ, అంజప్ప, కీరప్ప, భారత్ లు ఉన్నారు. జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ బండారి చంద్రశేఖర్ మాట్లాడుతూ మాలలకు ప్రభుత్వ పథకాలు చేరడం లేదని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాలలు వెనుకబాటుతనానికి కారణం విద్య, వైద్యమేనని అన్నారు. మాలలకు రోస్టర్ పాయింట్స్ లో చాలా అన్యాయం జరిగిందన్నారు. మాలలను చైతన్యం చేస్తూ వారికి విద్య వైద్యం అందించేందుకు కమిటీ కృషి చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర కృష్ణ పాల్గొన్నారు.



## జిల్లా నూతన విద్యుత్ శాఖ డీఈ రాజు నాయక్‌ను కలిసిన సర్పంచ్ దశరథ్

నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి జూన్11:నారాయణపేట జిల్లా విద్యుత్ శాఖ (ఎలక్ట్రికల్ విభాగం) నూతన డివిజనల్ ఇంజనీర్ (డీఈ)గా నియమితులైన రాజు నాయక్‌కు పోర్లకుంట తండా గ్రామపంచాయతీ సర్పంచ్ ఆర్.దశరథ్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ దశరథ్ మాట్లాడుతూ,రాజు నాయక్ నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడంతో పాటు విద్యుత్ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని కోరారు.నారాయణపేట జిల్లా అభివృద్ధికి విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని,నూతన డీఈ నాయకత్వంలో శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

## డీఈఓ సర్క్యులర్ జారీ.. జర్నలిస్టుల హర్షం విద్యాశాఖ అధికారికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ కృతజ్ఞతలు

నారాయణపేట ప్రతినిధి, జూన్ 10 ప్రజా జ్యోతి



నారాయణపేట జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందురాజులు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై జిల్లాలోని జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు.
జర్నలిస్టులు సమాజానికి సమాచారాన్ని అందించే క్రమంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజాసేవలో భాగస్వాములవుతున్నారని, వారి కుటుంబాలకు విద్యా పరంగా కొంత ఊరట కల్పించే ఉద్దేశంతో ఫీజు రాయితీ అమలు చేయాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) జిల్లా కమిటీ ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు కె. నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ కన్వీనర్ రాజేష్, ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యులు నక్క శ్రీనివాస్, రాష్ట్ర డిజిటల్ మీడియా సభ్యులు రఘు గణప, ప్రచార కార్యదర్శి సురేష్, జర్నలిస్టు నాయకులు శ్రీనివాస్ తదితరులు డీఈఓను కలిసి సమస్యను వివరించారు. జర్నలిస్టుల పిల్లలలో ఒకరికి ఉచితం, మరొకరికి ఫీజులో 50 శాతం ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం రెయితీ ఉంటుందన్నారు. ఫీజు రాయితీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘం ప్రతినిధుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందురాజులు, జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలు జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించేలా సంబంధిత సర్క్యులర్‌ను జారీ చేశారు. అనంతరం ఆ సర్క్యులర్ ప్రతులను జర్నలిస్టు ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో స్పందించి సర్క్యులర్ జారీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందురాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల జిల్లాలోని అనేక మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గి, వారి పిల్లల విద్యాభ్యాసానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో కూడా ఇదే విధమైన సహకారం అందించాలని కోరుతూ విద్యాశాఖ అధికారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని జర్నలిస్టు ప్రతినిధులు, సభ్యులు డీఈఓ నిర్ణయాన్ని స్వాగతించారు.

# గుర్తు తెలియని వాహనము ఢీకొని చికిత్స పొందుతూ రైతు మృతి

**నర్వ జూన్ 11 ప్రజా జ్యోతి**

గుర్తుతెలియని వాహనము ఢీకొని గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటన నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగింది

నారాయణపేట జిల్లా నర్వ: మండల పరిధిలో జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఒకరు మృతి చెందినట్లు నర్వ సబ్ ఇన్‌స్పెక్టర్ పబ్బతి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం---మరికల్ మండలం చిత్తనూర్ గ్రామానికి చెందిన బండ రాంరెడ్డి (45 సం॥, వ్యవసాయదారుడు) జూన్ 6, 2026 సాయంత్రం తన పొలంలో పశువులకు మేత వేసి, తన మోటార్ సైకిల్ టీజీ 38 4781) పై రాంపూర్ గేట్ సమీపంలోని నాయరా పెట్రోల్ బంకుకు వెళ్తుండగా, కాటన్ మిల్లు వద్ద అమరచింత వైపు నుండి వచ్చిన ఒక అపరిచిత వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంరెడ్డి కిందపడిపోగా, అదే దారిలో వెళ్తున్న తోటి గ్రామస్థుడు టి. శ్రీకాంత్ గమనించి బాధితుడి కుమారుడు బి. హర్షవర్ధన్ రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రాత్రి 8:10 గంటలకు హర్షవర్ధన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని, ఎడమ చెవి కింద తీవ్ర రక్తస్రావం మరియు కుడి చేయి విరిగి స్పృహతప్పి ఉన్న తన తండ్రిని మొదట ఓమ్ని వాహనంలో మరికల్ కు, ఆపై 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే రాంరెడ్డి మరణించినట్లు అక్కడి డ్యూటీ డాక్టర్లు ధృవీకరించారు. ఈ రోజు (11.06.2026) గురువారం ఉదయం 08:30 గంటలకు మృతుడి కుమారుడు బి. హర్షవర్ధన్ రెడ్డి (25 సం॥, ప్రైవేట్ ఉద్యోగి) ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన అపరిచిత వాహనాన్ని, దాని డ్రైవర్‌ను గుర్తించడానికి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పబ్బతి రమేష్ తెలిపారు

# చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

**నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి జూన్11:**
నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని ఖాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు కంటి పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి నుంచి నీరు కారడం, మంట, దురద వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. అలాగే తలనొప్పి, చూపు మందగించడం వంటి సమస్యలు ఉన్న 15 సంవత్సరాలు పైబడిన వారికి తక్కువ ధరకే కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి ఆపరేషన్లు సరోజినీ హాస్పిటల్‌లో ఉచితంగా చేయిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా గ్రామాల్లో బాల్య వివాహాల నివారణ, బాలికలకు గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు




నిర్వహిస్తున్నామని, సైబర్ నేరాల పట్ల కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యం.సాయప్ప ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, హైటెక్ మిషన్ సాయికుమారి, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ భాను ప్రసాద్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మద్దూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సి.చంద్రప్ప నియామకం

నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి జూన్11:నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఖాజీపూర్ సి.చంద్రప్ప, 1.ఉపాధ్యక్షులుగా,బాబు,వినోద్,గోపాల్, వెంకటేష్ ,చంద్రప్ప,జాజప్ప, 2.ప్రధాన కార్యదర్శులుగా బాల్ రాజు,మల్లేష్,ఆశప్ప,నర్సిములు,పవనకుమార్,ఆశప్ప, 3.సహాయ కార్యదర్శిలుగా మాల ఆశప్ప,కొడువాటి లాలప్ప,దుబాయ్ కృష్ణ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు చంద్రప్పకు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి,ఎస్సీ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని చంద్రప్ప తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలోని ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గం ఇన్చార్జి తిరుపతిరెడ్డి ఆదేశాలను అనుసరిస్తూ పార్టీ ని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతానని అన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చంద్రప్పకు శుభాకాంక్షలు తెలియజేసి,ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలపడాలని ఆకాంక్షించారు..



# నర్సింగ్ ప్రొఫెసర్స్ ట్రాన్స్ఫర్లకు అనుమతి ఇవ్వాలి

## డాక్టర్.ప్రేమ్ కుమార్

అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్11:
వైద్య ఆరోగ్య శాఖలో ప్రస్తుతం జరుగుతున్న సిబ్బంది ట్రాన్ఫర్లలో నర్సింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ల ట్రాన్ఫర్లకు అనుమతి ఇవ్వాలని సామాజికవిప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. 4సంవత్సరాలకంటే తక్కువ స్టాండింగ్ ఉన్నవారికి అనుమతి లేకపోవడం శోచనీయం అని 3 లేదా 4సంవత్సరాల స్టాండింగ్ ఉన్నవాళ్లకు వివిధ నర్సింగ్ కాలేజీలలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ల కు ట్రాన్స్ఫర్ల అనుమతి ఇచ్చి ట్రాన్ఫర్ ఇవ్వాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ప్రొఫెసర్ కోదండరాం కి వినతి పత్రం సమర్పించడం జరిగింది దీనికి ఎమ్మెల్సీ కోదండరాం సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ముఖ్య మంత్రి దృష్టి కి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ తెలిపారు.

